# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు




# – 20 –

# ఎంకి పెళ్లి -సుబ్బి చావు

ఆ మధ్య నాకు ఒంట్లో కాస్త నలతగా ఉంటే ఎందుకైనా మంచిది అని నాకు తెలిసిన ఒక డాక్టర్ దగ్గరకి వెళ్లాను. ఆ రెడ్డి గారికి రెండు డిగ్రీలు ఉన్నాయి. అంచేత ఏవో పై, పై పరీక్షలు చేసి, డిగ్రీకి ఒకటి చొప్పున రెండే రెండు మాత్రలు చేతిలో పెట్టి "రాజు గారూ, ఇందులో ఒకటి రాత్రి పడుకునే ముందు వేసుకోండి. పొద్దున్న లేస్తే రెండోది వేసుకోండి." అన్నాడు. "ఓరి వీడి దుంప తెగా, పొద్దున్న లేస్తే అంటాడేమిటీ ఈ మాత్రం దానికే అంత అనుమానమా" అనుకుని, కించిత్తు భయం కూడా పడి అక్కడి నుంచి పక్క వీధిలో ఈ డాక్టర్ కి పోటీ అయి, మరో రెండు డిగ్రీలు ఎక్కువ పెట్టుకున్న మరో డాక్టర్ దగ్గరకి వెళ్లాను. ఆ చౌదరి గారు నాలుగు పరీక్షలు చేసి పెదవి విరిచాడు. కొంచెం కంగారు పడి ఆ చుట్టుపక్కల ఏమన్నా బాల్చీ గానీ ఉందా అని చూశాను. ఎందుకంటే రూల్స్ ప్రకారం డాకర్లు పెదవి విరిచినా, నాలిక్కరుచుకున్నా, మరింకేం వెకిలి వేషాలు వేసినా ఎవరైనా బాల్చీ తన్నడానికి రెడీగా ఉన్నప్పుడే కదా. కానీ నాకు అల్యూమినియం బాల్చీ కానీ కనీసం వెదురు బొంగులతో నేసిన దేశవాళీ చేద కానీ ఎక్కడా కనపడక ఆయన్ని నిలదీశాను. దానికి ఆయన "ఇది ప్రాక్టీసు పెదవి విరవడం మాత్రమే...జస్ట్ సరదాకి. కానీ రేపు పొద్దున్నే వచ్చెయ్. మంచి ఆపరేషన్ చేస్తాను. నీ పరిస్థితి నా మొహం లా ఉంది." అన్నాడు నా మొహం చూడకుండా పక్కనే ఉన్న కంప్యూటర్ మొహం కేసి తీవ్రంగా చూస్తూ, తలపంకిస్తూ అచ్చు అలనాటి గుమ్మడిలా. మరి సినిమాలో గుమ్మడి మాటకి తిరుగు లేదు కదా. ఈ గుమ్మడీ అంతే కాబోలు అనుకుని ముందు "చచ్చాం రా" అనుకుని, "ఇంకా ఆ సీన్ రాలేదు గా. ఆయనది జస్ట్ ప్రాక్టీసు పెదవి విరవడమే కదా" అని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. ఇప్పుడు నాకు వచ్చిన అసలు సమస్య ఆ రెడ్డి గారు ఇచ్చిన మొదటి మాత్ర వేసుకోవాలా, వద్దా. వేసుకున్నచో, పొద్దున్న లేవ లేదు అనుకోండి..మాట వరసకే సుమా. అప్పుడు ఈ చౌదరి గారి దగ్గరికి వెళ్ళ లేను కాబట్టి ఆయన మనోభావాలు దెబ్బతింటాయి కదా, కిం కర్తవ్యం మూఢం. టుడూ ఆర్ నాట్ టుడూ అనే ఆలోచన ఎంతకీ తెగక పొద్దున్న లేవడం గేరంటీ చేసుకోడం కోసం రెడ్డి గారు ఇచ్చిన మాత్ర రాత్రి వేసుకోకూడదు అనే నిర్ణయానికి వచ్చాను. ఎందుకంటే అది వేసుకుంటే అనుమానం కానీ వేసుకోక పోతే పొద్దున్న లేవవు అని ఆయన చెప్ప లేదుగా. అదీ నా అఖండమైన లాజిక్.

మొత్తానికి ఆ మర్నాడు నిఝంగానే లేచి ప్రపంచంలోనే మొదటి సర్జన్ అయిన వేదకాలం నాటి సుశ్రుత గారికి నమస్కారం పెట్టుకుని చౌదరి గారి ఆసుపత్రికి వెళ్లాను. లోపలికికి వెళ్ళగానే నా పంట్లాం, చొక్కా అన్నీ విప్పించేసి ప్లాస్టిక్ గౌను వేసి బల్లమీద పడుకోబెట్టారు. ఈ లోగా అలాంటి ప్లాస్టిక్ బట్టలే వేసుకున్న ఒకాయన లోపలికి రాగానే ఆయన కూడా నా లాగా కోత కోయించుకోడానికి వచ్చిన బాపతే అనుకుని "చిన్న కత్తా, పెద్ద కత్తా?" అని ఆప్యాయంగా పలకరించాను. "రెండూ ఉన్నాయి పేషెంటూ, ముందు ఒక దాంట్లో మొదలు పెట్టి అవసరం అయితే రెండో చేత్తో రెండోది కూడా వాడతాను" అని ఆయన అనగానే నాకు ఆయనే కత్తి గుచ్చే వీరుడే కానీ ఎవడి చేతో పొడిపించుకునే వాడు కాదు" అని అర్థం అయిపోయింది. ఆయన కూడా విషయ స్పష్టీకరణ కోసం తన బిజినెస్ కార్డ్ గజ గజా వణుకుతున్న నా అరిచేతిలో పెట్టాడు. ఆ శర్మ గారికి అటు కాకినాడ నుంచి కాలిఫోర్నియా దాకా ఆయుర్వేదం నుంచి హోమోయో పతి దాకా కార్డు రెండు వేపులా డిగ్రీలు, డిప్లమోలు మరియు అవి చాలవన్నట్టు బిషగ్ రత్న, వైద్య సమ్రాట్ లాంటి

బిరుదులు కూడా ఉన్నాయి. నేను మెచ్చుకుని మేక తోలు కప్పే పరిస్థితిలో లేక "ఆపరేషన్ చౌదరి గారు చెయ్యాలి కదా. ఆయనేడీ?" అని అడిగాను. శర్మ గారు అదోలా నవ్వి "ఆయన ఫేమిలీ వెకేషన్ మీద అమెరికా వెళ్ళారు." అన్నాడు. "హోరి వాడి దుంప తెగా...మరి ఏం చెయ్యాలో మీకు చెప్పాడా?" అని నా అనుమానం వెలిబుచ్చుతున్నప్పుడు నా గొంతుక, కాళ్ళు అప్పటికే వణుకుతున్న చేతులతో చేతులు కలిపాయి.

"అదేమిటి రాజు గారూ. అలా వణికి పోతున్నారూ?" తాపీగా అడిగాడు డా. శర్మ గారు.

"డాక్టర్ గారూ. నా జన్మలో ఇప్పటి దాకా నా వొంటి మీద ఒక్కసారి కూడా కత్తి పడ లేదు. కనీసం చెయ్యి కూడా పడ లేదు. ఎందు వలన అనగా మాది ఆదర్శ దాంపత్యం. ఇదే నా మొట్ట మొదటి ఆపరేషన్. హడిలి చస్తున్నాను." ఉన్నమాట చెప్పేశాను.

"భలే వారే. చౌదరి గారు పక్కన లేకుండా నాక్కూడా ఇదే కదా మొదటి సారి. చూడండి ఎంత ధైర్యంగా ఉన్నానో. కంగారు పడకండి. " అన్నాడు డా. శర్మ గారు.

ఈ లోగా ఓ నర్సు ఓ పెద్ద బంతి పూల దండ మోసుకుని లోపలికి వచ్చింది. అది చూసి నా పై ప్రాణాలు పైకే పోయి "అదేమిటమ్మా నర్సమ్మా, ఆపరేషన్ గది లోకి ఆ దండ ఏమిటీ?. ప్రార్ధన టైమా ఇది?" అనగానే

"ఆ..ఏం లేదు పేషెంటూ. ఆపరేషన్ సక్సెస్ అయితే డా. శర్మ గారికీ, అవకపోతే మీకూ వేద్దాం అనీ" అని సాగదీసుకుంటూ విలాసంగా చెప్పింది.

డాక్టర్ల మీద ఈ పైన వ్రాసిన చమత్కారాలన్నీ నేను అమెరికాలో చాలా నగరాలలో ఏదో ఒక సందర్భంలో మాట్లాడేటప్పుడో, ప్రత్యేకించి హాస్య ప్రసంగాలు చేసేటప్పుడో అటు నుంచి, ఇటు మార్చి చాలా సార్లు చెప్పిన పాత జోకులే. అంటే శ్రీశ్రీ గారు చెప్పినట్టు "సీసా లేబుల్ మార్చేసి బ్రాందీ ని విస్కీ గా" మార్చేసినవే. కాపీ రైట్ ప్రకారం కాపీ కొట్టినవే.

ఇప్పుడు ఇవన్నీ ఎందుకు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చాయీ అంటే....

నిన్న పొద్దున్నే మా క్వీన్ విక్టోరియా నా మందుల పెట్టి మీద కన్నేసింది. అందులో ఒక ఎర్ర మాత్ర పైకి తీసి "ఇదిగో మొగుడూ, ఇది వేసుకుంటే చస్తావ్. జాగ్రత్త" అని బయట పారెయ్య బోయింది. నాకు తెలియక అడుగుతానూ...ఎవరైనా మాత్ర వేసుకోక పోతే చస్తారు కానీ వేసుకుంటే చచ్చుదురా?. ఆ మాటే అడిగాను మా క్వీన్ విక్టోరియాని.

"అది కాదు. ఆ ఎర్ర మాత్ర నీకున్న బీపీ తగ్గడానికి. కానీ అది కిడ్నీ ని చావగొడుతుంది అని గూగుల్ వారు చెప్పారు. నీ బీపీకి మరో మందు చూసుకో." అంది మా క్వీన్ విక్టోరియా.

"మరి కిడ్నీ కే ఓ మాత్ర వేసుకుంటే సరిపోదా?

"నీ మొహం. మూత్ర పిండములు అత్యంత ప్రాధాన్యత కలిగిన అవయవములు. వాటికి జబ్బు వచ్చిన యడల అది పోగొట్టుటకు మందులు లేవు కావున అంతే సంగతులు. అంచేత ఆ మాత్ర మానేసి కిడ్నీ పాడవకుండా చూసుకో. లేక పోతే ఏమవుతుందో నువ్వే చూసుకో. నా వాళ్ళ కాదు" అని తన చూపుడు వేలు ఝాడించి నా బీపీ పెంచేసింది. పోనీలే. ఆవిడ అంతగా చెప్తుంటే బావుండదు కదా అని మర్నాడు మా బీపీ డాక్టర్ దగ్గరకి వెళ్తే ఆయన ఓ వెర్రి నవ్వు నవ్వి "షి ఈజ్ రైట్" అని కొత్త రకం పసుపు మాత్రలు ఇచ్చాడు.

హమ్మయ్య , ఇక బీపీ గోల లేదు కానీ మరో గోల ఉంది కదా అని ఆ మర్నాడు మా డయాబీటిస్ డాక్టర్ దగ్గరకి వెళ్ళగానే ఆయన నేను వేసుకుంటున్న మాత్రల లిస్టు చూసి "ఇదిగో ఆ పసుపు రంగు మాత్రలు వేసుకోకు, చస్తావ్." అన్నాడు.

నేను డిటో...అంటే ఎవరైనా మాత్ర వేసుకోక పోతే చస్తారు కానీ వేసుకుంటే ఎందుకు చస్తారు.

"నీ మొహం. అది కాదు లాజిక్కు. ఈ పసుపు రంగు మాత్ర వేసుకుంటే బీపీ తగ్గుతుందో లేదో నాకు తెలీదు కానీ నీ షుగర్ అమాంతం పెరిగి పోతుంది."

ఇలా అన్ని రకాల డాకర్ల దగ్గరకీ వెళ్లి నేను మళ్ళీ తెలుసుకున్నది ఏమిటంటే....ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందీ..అని..అనగా గుండె కాయ అనే ఎంకికి పెళ్లి చేస్తే...సుబ్బి అనే కిడ్నీ చావుకీ...అలాగే కిడ్నీ అనే ఎంకికి పెళ్లి చేస్తే షుగర్ అనే సుబ్బి చావుకీ..... వగైరా.....అంచేత ఏ మాత్రా వేసుకోకుండా మృత్యుంజయ మంత్రం పఠించుకుంటే....అన్ని అవయవాలూ బుద్ధిగా పనిచేసుకుంటూ ఉంటాయి....

ఆ మాటే అనగానే “సరేలే. నీ వాలకం చూస్తే మాత్రలు మానేసి అన్నింటికీ గోమూత్రం వాడేలా ఉన్నావ్!” అని విసుక్కుంటూ అన్ని రంగుల మాత్రలూ నా మాత్రల డబ్బాలో జాగ్రత్తగా సద్దేసింది మా క్వీన్ విక్టోరియా.

**COMMENTS**